



అడుగంటిన గొల్లపల్లి జలాశయం

పాలకులకు కొరవడిన ముందుచూపు

రిజర్వాయర్లను నింపడంలో నిర్లక్ష్యం

బీడుగా మారిన ఆయకట్టు

వేసవిలో దాహపు కేకలు తప్పవా?

జలఘుంటికలు!

అడుగంటిన జలాశయాలు



గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి తాగునీరు అందించే ఇన్‌టెక్ వెల్

శ్రీశైలం జలాశయం నుంచి హంద్రీనీవా కాలువకు నీటిని ఎత్తిపోస్తారు. కాలువ ద్వారా ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాలకు నీటిని ఇస్తారు. జలాశయంలో 810 అడుగుల వరకే హంద్రీనీవా కాలువకు నీరు ఎత్తిపోయడానికి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం నీటిమట్టం 812 అడుగులకు పడిపోయింది. నేడో.. రేపో.. కృష్ణాజలాల ప్రవాహం ఆగిపోనున్నట్లు హంద్రీనీవా ప్రాజెక్టు అధికారులు సూచనప్రాయంగా వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రధానమైన మూడు జలాశయాలను నింపకపోవడంతో వెలవెలబోతున్నాయి. గతేడాది ఆగస్టు 16వ తేదీనే శ్రీశైలం జలాశయం నుంచి నీటి ఎత్తిపోతలు ప్రారంభించినా.. నిర్దేశిత మొత్తంలో సగమే నీరు ఇవ్వగలిగారు. గరిష్ఠంగా 40 టీఎంసీలకుపైగా తోడుకోవచ్చు. ఈసారి 22 టీఎంసీలు కూడా హంద్రీనీవా కాలువలో పారించలేకోయారు. ఆ నీటిని పక్క జిల్లాకు మళ్లించి జిల్లాలోని జలాశయాలను ఎండబెట్టారు. గత నెలలో కుప్పానికి కృష్ణా నీళ్ల పేరిట షో చేసేందుకు సీఎం జగన్ జీడీపల్లి రిజర్వాయర్ నుంచి పుంగనూరు కాలువలో కొన్ని నెలలపాటు కుప్పానికి నీరు తీసుకెళ్లారు. ఈ కారణంతోనే జిల్లాలోని రిజర్వాయర్లు ఎండబెట్టినట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు. హంద్రీనీవా కాలువలో నీటి విడుదల తరువాత గతంలో ఎన్నడూలేని విధంగా ఈదఫా జలాశయాల్లో నీరు అడుగంటిపోయింది. చెరువులను నింపలేని దయనీయ స్థితి నెలకొంది.

జిల్లాలో జలఘుంటికలు మోగనున్నాయి. పాలకుల నిర్లక్ష్యం, ముందుచూపు లేమి కారణంగా జిల్లాలోని జలాశయాలు నీరులేక వెలవెలబోతున్నాయి. చెరువులు వట్టిపోయాయి. దీంతో ఆయకట్టు బీడుగా మారిపోయింది. వేసవిలో జిల్లా ప్రజలకు దాహపు కేకలు తప్పేలా లేవు. ఇప్పటికే బోరుబావులు ఎండిపోయి, గ్రామాల్లో నీటి కష్టాలు మొదలయ్యాయి. చాలా చోట్ల వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. తాగునీరు అందించే రిజర్వాయర్లలో నీటి నిల్వలు లేని కారణంగా వేసవిలో తీవ్ర తాగునీటి ఎద్దడి తప్పదన్న వాదనలు వినిపిస్తున్నాయి. హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్) పథకం కింద శ్రీశైలం జలాశయం నుంచి నీటిని ఎత్తిపోసి, జిల్లాకు సరఫరా చేస్తున్నారు. హంద్రీనీవా కాలువ ద్వారా నీరిస్తున్నారు. కాలువలో నీటి ప్రవాహానికి నేడో, రేపో తెరపడనుంది. జిల్లాలోని జలాశయాల్లో నీటి నిల్వలు లేవు. ఈ నేపథ్యంలో నీటి సరఫరా ఆగిపోతే తీవ్ర ఇబ్బందులు తప్పవు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ పథకం కింద జలాశయాల నిర్మాణం తరువాత ఇలాంటి దుస్థితి ఎన్నడూ చూడలేదని రైతులు వాపోతున్నారు.

- పుట్టపర్తి, ఆంధ్రజ్యోతి

జలాశయాలను ఎండబెట్టి..


గతేడాది ఆగస్టు 16న శ్రీశైలం జలాశయం నుంచి హంద్రీనీవా కాలువకు నీటి విడుదల మెదలైంది. ఈనెల 7 నాటికి ఉమ్మడి అనంత జిల్లా సరిహద్దుకు 16.509 టీఎంసీలు చేరింది. అనంతపురం జిల్లా పరిధిలో తొలి దశ కింద 6.808 టీఎంసీల నీటిని వాడుకోగా.. మిగతా 9.703 టీఎంసీలు జీడిపల్లి జలాశయానికి చేరాయి. జలాశయం నుంచి రెండో దశలో మడకశిర, పుంగనూరు ఉప కాలువలు ఉన్నాయి. రెండోదశ కాలువకు 6.658 టీఎంసీలను పంపినట్లు హంద్రీనీవా అధికారుల లెక్కలు వెల్లడిస్తున్నా.. ఏయే రిజర్వాయర్, చెరువులను నింపారో చెప్పలేకపోతున్నారు. తొలిదశ కాలువ కింద ఉమ్మడి అనంత జిల్లాలో జీడిపల్లి జలశయం నీటి సామర్థ్యం 1.681 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 0.429 టీఎంసీలే నిల్వ ఉంది. రెండో దశలో మడకశిర, పుంగనూరు ఉపకాలువ కింద గొల్లపల్లి జలాశయం పూర్తి సామర్థ్యం 1.913 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 0.879 టీఎంసీ, బుక్కపట్నం మండలంలోని మారాల జలాశయం సామర్థ్యం 0.483 టీఎంసీలు కాగా.. కేవలం 0.064 టీఎంసీ మాత్రమే నీరు ఉంది. ఈ జలాశయం కింద 18 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా.. నీటి సరఫరా ఆగిపోయింది. కదిరి మండలం చెర్లోపల్లి జలాశయం సామర్థ్యం 1.608 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 0.395 టీఎంసీ మాత్రమే ఉంది. కాలువలో నీటి ప్రవాహం నెమ్మదించింది. రిజర్వాయర్లను నింపే అవకాశం లేదు. దీంతో జలాశయాలు, చెరువుల కింద ఆయకట్టు బీడుగా మారనుంది. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇక్కట్లు తప్పేలా లేవు. గతంలో హెచ్ఎన్ఎస్ఎస్ పథకం కింద రిజర్వాయర్లు, చెరువులు నీటితో తొణికిసలాడేవి. ప్రస్తుతం నీరులేక వెలవెలబోతున్నాయి. వైసీపీ పాలకుల నిర్లక్ష్యం, ముందుచూపు కొరవడడమే ఇందుకు కారణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేసవిలో తాగునీటికి తిప్పలు

పెనుకొండ మండలం గొల్లపల్లి రిజర్వాయర్.. కియ కార్ల పరిశ్రమతో పాటు అనుబంధ కంపెనీల అవసరాలు, హిందూపురం, పెనుకొండ వాసుల దాహం తీర్చుతోంది. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర ఉపకాలువ కింద గొల్లపల్లి జలాశయం నిర్మాణం చేపట్టారు. ఈ జలాశయం కింద కియ కార్ల పరిశ్రమతోపాటు అనుబంధ సంస్థలకు నీరు ఇస్తున్నారు. మడకశిర ఉపకాలువ కింద పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో 265 చెరువులకు నీరు ఇవ్వాలని కాలువల నిర్మాణం చేపట్టారు. టీడీపీ హయాంలో 2018లో మడకశిర ఉపకాలువకు నీరు ఇచ్చి, చెరువులను నింపారు. హిందూపురంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. రూ.194 కోట్లుపైగా ఖర్చు చేసి, గొల్లపల్లి జలాశయం నుంచి నేరుగా ప్రత్యేక పైపులైన్ ద్వారా పురానికి తాగునీరు అందించి, దాహార్తి తీర్చారు. ఇక్కడి నుంచే పెనుకొండకు తాగునీరు అందిస్తున్నారు. ఏటా మడకశిర ఉపకాలువ కింద వందలాది చెరువులను నింపుతూ తాగునీటికి ఇబ్బందిలేకుండా చూసేవారు. 2020 నుంచి 2022 దాకా ఎగువన కర్ణాటకలో భారీ వర్షాలతో నదులు పొంగిపొర్లాయి. చెరువులు నిండిపోయి నీటి సమస్య తలెత్తలేదు. ఈ ఏడాది వర్షాభావంతో చెరువులు వట్టిపోయాయి. అయినా.. గొల్లపల్లి రిజర్వాయర్‌కు నెలరోజులపాటు నీరు ఇచ్చి తర్వాత బంద్ చేశారు. పక్క జిల్లాలోని కుప్పం వైపు నీటిని ఫిబ్రవరి ఆఖరుదాకా తరలించారు. మడకశిర ఉపకాలువకు నీరు ఇవ్వకపోవడం ఇదే తొలిసారి అని చెప్పాలి. గొల్లపల్లి జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 1.913 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 0.879 టీఎంసీలకు పడిపోయింది. కియతోపాటు పెనుకొండ, హిందూపురం పట్టణాలకు రోజూ సగటున 20 ఎంఎల్‌డీ దాకా తాగునీటిని అందిస్తున్నారు. జలాశయానికి నీటి ప్రవాహం లేకపోవడంతో ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాల్సి వస్తోంది. తొలిగా కియతోపాటు అనుబంధ సంస్థలకు నీరు ఇచ్చి, హిందూపురానికి సరఫరా చేసే నీటిలో కోతపెట్టే పరిస్థితి రావచ్చునన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో జనం తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడాల్సివస్తోంది. మరో నెల రోజులు గడిస్తే జలాశయం అడుగంటి పోయి, తీవ్ర తాగునీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉన్నట్లు తెలుస్తోంది.



అడుగంటిన చెర్లోపల్లి రిజర్వాయర్



వట్టిపోయిన మారాల జలాశయం

ఇంటర్ పరీక్షకు 304 మంది గైర్హాజరు

కొత్తచెరువు, మార్చి 13: జిల్లావ్యాప్తంగా 41 కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షకు 304 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్ఐఓ సురేశ్‌బాబు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 9404 మంది విద్యార్థులకుగాను 9100 మంది హాజరయ్యారన్నారు. 304 మంది గైర్హాజరయ్యారన్నారు.

కొత్తచెరువు లేఔట్‌లో అక్రమాలు

జగనన్న స్థలం @ రూ.50వేలు

కొత్తచెరువు: మండల కేంద్రం సమీపంలోని జగనన్న లేఔట్‌లో స్థలాలను అమ్మకానికి పెట్టారు. రూ.50వేలు ధర పెట్టి, వీఆర్వో పబ్లిక్‌గానే అమ్మేస్తున్నాడు. మ్యాపింగ్‌తో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఇలా 22 ఇళ్ల స్థలాలను వైసీపీ నాయకుల పరం చేశాడు. రూ.1.50 కోట్ల విలువచేసే భూమిని కట్టబెట్టారు. అధికారం ఉందన్న ధీమాతో అక్రమ మార్గంలో పట్టాలు పొందిన వైసీపీ నాయకులు పట్టాలు రాకనే యథేచ్ఛగా పనులు చేపట్టారు. అది కూడా.. ఎక్స్‌కవేటర్లతో పునాదులు తీయిస్తున్నారు. ఇదేంటని అడిగితే.. వైసీపీ, అధికారుల అండ ఉందనీ, ఎవరూ ఏమీ చేయలేరంటూ దర్జా ప్రదర్శిస్తున్నారు.

- వీఆర్వో వసూళ్లపర్వం
- మ్యాపింగ్‌తో రిజిస్ట్రేషన్
- 22 స్థలాలు వైసీపీ నాయకులకు..
- పట్టాలు రాకనే పునాదులు..
- చోద్యంచూస్తున్న ఉన్నతాధికారులు



జగనన్న లేఔట్‌లో ఎక్స్‌కవేటర్లతో పునాదులు తీయిస్తున్న దృశ్యం

రూ.11 లక్షలు వసూలు..

అందరికీ ఇళ్లపట్టాలు పథకంలో భాగంగా కొత్తచెరువు సమీపంలోని ధర్మవరం ప్రధాన రహదారి పక్కన సర్వే నంబరు 384లో 280 ఇళ్ల పట్టాలకు రెవెన్యూ అధికారులు లేఔట్ వేశారు. ఇందులో 140 మందికి తొలివిడతలో పట్టాలను పంపిణీ చేశారు. మిగిలిన 140 పట్టాల్లో ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి ఇటీవలే 120 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలను గుట్టుచప్పుడు కాకుండా పుట్టపర్తిలోని తన కార్యాలయానికి పిలుపించుకుని, ఇళ్లపట్టాలను అందించారని సమాచారం. ఇక 20 స్థలాలు మిగిలాయి. వీటిపై వీఆర్వో శ్రీనివాస్ కన్నుపడింది. వీటికి మరో రెండు స్థలాలను చేర్చి, మొత్తం 22 బేరానికి పెట్టారన్న విమర్శలున్నాయి. ఇక్కడ సెంటున్నర స్థలం రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు పలుకుతోంది. ఈలెక్కన మొత్తం స్థలాల విలువ రూ.1.50 కోట్లకు పైమాటే. వీటిలో ఒక్కో స్థలానికి రూ.50 వేలు చొప్పున ధర నిర్ణయించినట్లు ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఓ వైసీపీ నాయకుడు మధ్యవర్తిగా ఉంటూ 22 స్థలాలకు మొత్తంగా రూ.11 లక్షలు వసూలు చేసి, వీఆర్వోకు ముట్టజెప్పినట్లు మండలకేంద్రంలో చర్చ సాగుతోంది. అలా.. ఆ స్థలాల్లో వైసీపీ గద్దలు వాలిపోయాయి. అధికార పార్టీ అండతో ఆన్‌లైన్‌లో పట్టాలు మంజూరు కాకనే మ్యాపింగ్ ద్వారా స్థానిక వీఆర్వో శ్రీనివాస్ రిజిస్ట్రేషన్ చేయించాడంటూ తెరపైకి వచ్చారు. పట్టాకు రూ.50 వేలు ఇచ్చామనీ, రిజిస్ట్రేషన్ చేసుకున్నామంటూ కొంత మంది పట్టాలు పొందిన వైసీపీ నాయకులు బహిరంగంగానే పేర్కొంటున్నారు. పేదవాడు ఇంటిపట్టా కోసం కాళ్లు అరిగేలా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేసినా వారిపై కనికరం చూపని రెవెన్యూ అధికారులు.. వైసీపీ నాయకులు రెండు, మూడు ఇళ్లు ఉన్నవారికి, ఒకే ఇంట్లో ముగ్గురు, నలుగురికి పట్టాలు ఎలా ఇచ్చారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పేదవాడికి ఒక న్యాయం, అధికార పార్టీ నాయకులకు మరో న్యాయమా అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. త్వరలో ఎన్నికల కోడ్ అమలులోకి రానుండడంతో ఇదే అదునుగా భావించిన వైసీపీ నాయకులు రంగంలోకి దిగారు. అక్రమంగా పొందిన స్థలాల్లో ఏకంగా ఎక్స్‌కవేటర్లతో పునాదులకు గుంతలు తీయిస్తున్నారు. ఈ తతంగం పబ్లిక్‌గానే సాగుతున్నా.. రెవెన్యూ ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది.

నా దృష్టికి రాలేదు

ఎన్నికల బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లా నుంచి ఇటీవలే ఇక్కడికి వచ్చా. గతంలో ఉన్న తహసీల్దార్ ఇళ్ల పట్టాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. పట్టాలు రాకున్నా ఆన్‌లైన్ మ్యాపింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయవచ్చు. ఈ నిబంధన మేరకే గతంలో తహసీల్దార్ చేసి ఉండవచ్చు. పట్టాలపై డబ్బు వసూలు చేసిన విషయం నా దృష్టికి రాలేదు. - కళావతి, తహసీల్దార్, కొత్తచెరువు

పీఎం సూరజ్ కింద రూ.12.74 కోట్ల లబ్ధి

పుట్టపర్తి రూరల్, మార్చి 13: జిల్లాలో పీఎం సూరజ్ పథకం కింద లబ్ధిదారులకు 12.74 కోట్ల లబ్ధి చేకూర్చినట్లు డీఆర్వో కొండయ్య పేర్కొన్నారు. అందుకు సంబంధించిన మెగా చెక్కును బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో విడుదల చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా పీఎం సూరజ్ కింద రుణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సాంఘిక సంక్షేమ శాఖాధికారి శివరంగప్రసాద్ పాల్గొన్నారు.



ఎన్నికలకు సంసిద్ధం

పుట్టపర్తి రూరల్, మార్చి 13: సార్వత్రిక ఎన్నికలకు జిల్లా యంత్రాంగం అన్నివిధాలా సంసిద్ధంగా ఉందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనాకు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు వివరించారు. ఎన్నికల ప్రధానాధికారి రాష్ట్ర సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి మాట్లాడుతూ.. పెండింగ్ క్లైంలను త్వరగా పరిష్కరించడంతోపాటు ఓటర్ల గుర్తింపు కార్డుల పంపిణీని వేగవంతం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలా సంసిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఫాం 6, 7, 8 క్లైంలపై ఎప్పటికప్పుడు విచారణ చేసి, పరిష్కరిస్తున్నామన్నారు. ఎపిక్ కార్డులను ఓటర్లకు పంపిణీ చేస్తున్నామన్నారు. వీసీలో డీఆర్వో కొండయ్య, పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్, నియోజకవర్గ ఎన్నికల అధికారులు భాగ్యరేఖ, వెంకటశివసాయిరెడ్డి, గౌరీ శంకర్ పాల్గొన్నారు.




వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి



వైభవంగా సిద్దేశ్వరుడి బ్రహ్మరథోత్సవం

జన సంద్రమైన హేమావతి

మడకశిర టౌన్, మార్చి 13: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన అమరాపురం మండలంలోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్దేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తుల శివనామస్మరణతో ఉత్సవాన్ని లాగారు. ఉదయం 5.30గంటలకు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 4 గంటలకు హెంజేరు సిద్దేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాన్ని వెండికవచంతో ప్రత్యేకంగా అలంకరించి, బ్రహ్మరథంలో ఏర్పాటు చేశారు. శివనామస్మరణతో రథాన్ని లాగారు. వేలాది మంది భక్తుల నడుమ రథోత్సవం సాగింది. భక్తులు రథంపై అరటి పండ్లు, టెంకాయలు, బెల్లం చూర్ణం, మిరియాలు వేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. రథోత్సవానికి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో హేమావతి జనసంద్రమైంది. ప్రత్యేక డోలువాయిద్య బృందాలు రథోత్సవంలో పాల్గొన్నాయి.



అలంకరణలో హెంజేరు సిద్దేశ్వరస్వామి

వేలాది మంది భక్తుల నడుమ సాగుతున్న బ్రహ్మ రథోత్సవం

సరదా కాదు.. సంకటం..

ఫొటోలో కనిపిస్తున్న పిల్లలు ముగ్గురూ విద్యార్థులు. తనకల్లు మండలంలోని రతినేనాయక్ తండా ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్నారు. సరదాకి ఇలా.. కొళాయి కింద తలలు తడుపుకుంటున్నారనుకుంటే పొరబడినట్లే. ఎండవేడిమి, ఉక్కపోత భరించలేక ఇలా తిప్పలు పడుతున్నారు. బడిలో బుధవారం మధ్యాహ్నం భోజనం చేశారు. బయట ఎండలు మండిపోతున్నాయి. తరగతి గదిలో ఉక్కపోతతో విలవిల్లాడుతున్నారు. భరించలేక చిన్నారులు ఇలా.. పాఠశాల ఆవరణలోని కొళాయి కింద తలలు తడుపుకుంటూ ఉపశమనం పొందారు. విద్యార్థులు ఇలా ఇబ్బందులు పడుతుంటే.. రాష్ట్రప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ఏటా ఈనెల 15వ తేదీ నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాల్సి ఉంది. ఈసారి ఎండలు మండిపోతుంటే చిత్రంగా ఒంటిపూట బడులను మరో 3 రోజులు ఆలస్యంగా ఈనెల 18వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఎండలు మండుతుంటే ఇలాంటి నిర్ణయాలు ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

-తనకల్లు



రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.33 గురువారం (సాయంత్రం)	5.07 శుక్రవారం (ఉదయం)
కదిరి	6.30 గురువారం (సాయంత్రం)	5.12 శుక్రవారం (ఉదయం)
ధర్మవరం	6.35 గురువారం (సాయంత్రం)	5.09 శుక్రవారం (ఉదయం)
హిందూపురం	6.33 గురువారం (సాయంత్రం)	5.13శుక్రవారం (ఉదయం)
పెనుకొండ	6.31 గురువారం (సాయంత్రం)	5.11 శుక్రవారం (ఉదయం)

గూడుకట్టుకున్న వ్యథ

- తీరని పేదోడి సొంతింటి కల
- పెండింగ్‌లో జగనన్న లేఅవుట్లు
- మంజూరు 41,438.. కట్టింది 10,610 ఇళ్లే
- మిగిలిన వారికి తప్పని ఎదురుచూపులు
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు

అనంతపురం సిటీ, మార్చి 13: నవరత్నాలు- పేదలందరికి ఇళ్ల పథకం పథకం సమస్యలతో సతమతవుతోంది. వైసీపీ అధికారంలోకి రాగానే జిల్లా వ్యాప్తంగా 458 జగనన్న లేఅవుట్స్ పేరుతో 41,438 ఇళ్లను మంజూరు చేశారు. అయితే ఎక్కడా ఆశించిన స్థాయిలో నిర్మాణాలు సాగలేదు. కొన్నిచోట్ల కోర్టు కేసులతో జగనన్న కాలనీలే ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో వైసీపీ ఐదేళ్ల పాలనలో 10,610 ఇళ్లు మాత్రమే జగనన్న లే అవుట్లలో నిర్మించినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మరి మిగిలిన 30,828 ఇళ్లను ఇంకెప్పుడు పూర్తి చేస్తారో తెలియని స్థితి. సాధారణ ఎన్నికలు తరుముకొస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం తమ గోడు పట్టించుకుంటుందా అనే ఆవేదన లబ్ధిదారుల్లో నెలకొని ఉంది.

జిల్లాలో పరిస్థితి ఇలా...



- జిల్లా వ్యాప్తంగా జగనన్న లేఅవుట్లు : 458
- జగనన్న లేఅవుట్లలో మంజూరైన ఇళ్ల సంఖ్య : 41,438
- ఇప్పటికి పూర్తయిన ఇళ్ల సంఖ్య : 10,610
- మిగిలిన ఇళ్ల సంఖ్య : 30,828
- కోర్టు కేసులతో ఆగిన ఇళ్లు : సుమారు 12 వేలకు పైగా
- ఇప్పటికి ఎలాంటి నిర్మాణానికి నోచుకుని ఇళ్ల సంఖ్య : 457

మంజూరు ఘనం.. నిర్మాణాలు అంతంతే...

జిల్లా వ్యాప్తంగా 458 లేఅవుట్లలో అర్హులైన 41,438 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలతో పాటు ఇళ్లను మంజూరు చేసి మమ అనిపించారు. ఇళ్ల నిర్మాణాల విషయంపై ప్రభుత్వం ఏమాత్రం దృష్టి పెట్టలేదు. కనీసం యంత్రాంగాన్ని కూడా ఆ దిశగా నడిపించలేదు. చాలా లేఅవుట్లలో కనీస వసతులు సైతం లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు స్తంభించిపోయాయి. ఇసుక, సిమెంట్, బిల్లుల మంజూరు జాప్యంతో నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని భావించి సీఎం జగన్ జిల్లా యంత్రాంగంపై నిర్మాణాల వేగం పెంచాలని ఒత్తిడి చేస్తే.. కొంత నిర్మాణాలు సాగినట్లు ఆశాఖ అధికార వర్గాల ద్వారా తెలిసింది.

ఇప్పటికి 12వేల ఇళ్లకు పైగా కోర్టు కేసులు...

గత ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే ప్రతి పేదోడికి ఇంటి పట్టాతో పాటు సొంతింటి కల నెరవేరుస్తాం అని సీఎం జగన్ ప్రకటించారు. వైసీపీ పాలనలో 41,438 ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో 50శాతం ఇళ్లను కూడా ఈ ఐదేళ్లలో పూర్తి చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. అనంతపురం, రాప్తాడు, తదితర నియోజకవర్గాల పరిధిలో సుమారు 12వేల మందికి ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది. కోర్టులో కేసులు ఉండటంతో వీటిలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదు. కోర్టు కేసులు ఉన్న స్థలాల్లో ఇంటి పట్టాలు మంజూరు చేయడంపై లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కోర్టు కేసుల సమస్య ఏర్పడి మూడేళ్లనా దాని పరిష్కారం దిశగా వైసీపీ ప్రభుత్వం ఆలోచించకపోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతోంది.



కామారుపల్లిలోని జగనన్న లేఅవుట్



నగర శివారులోని ఆలమూరు జగనన్న లేఅవుట్ ఇలా...

458 జగనన్న లేఅవుట్లలో సమస్యల తిష్ట

జిల్లాలోని అనంతపురం, గుంతకల్లు, కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో ప్రభుత్వం 458 జగనన్న లేఅవుట్లను ఏర్పాటు చేసి అర్హులైన 41,438మందికి ఇంటి స్థలం పట్టాలతో పాటు ఇళ్లను మంజూరు చేసింది. అయితే ఆ లేఅవుట్లలో కనీసం రోడ్లు, కాలువలు, నీరు, విద్యుత్ తదితర వసతులు కూడా లేవు. దీంతో ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. కొన్ని జగనన్న లేఅవుట్లు కొండ, గుట్టల్లో ఉండటంతో వివిధ కారణాలను సాకుగా చూపుతూ కాంట్రాక్టు పొందిన ఏజెన్సీలు కూడా ఇళ్ల నిర్మాణాలు చేయకుండా గాలికి వదిలేశారనే విమర్శలు ఉన్నాయి.

వేగవంతం చేస్తున్నాం

జిల్లాలో జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేస్తున్నాం. కొన్ని కోర్టు కేసులతో పెండింగ్ ఉన్న మాట వాస్తవమే. ఎక్కడైతే సమస్యలు ఉన్నాయో వాటిని గుర్తించి విడతల వారిగా పూర్తి చేస్తున్నాం. ఇప్పటి వరకు జగనన్న లేఅవుట్లలో 10,610 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలిన వాటిని త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.



నరసింహారెడ్డి,
ఇన్‌చార్జి పీడీ, జిల్లా గృహ నిర్మాణశాఖ

వైసీపీకి ఓట్లేస్తే పల్లెలు శిథిలమే

- ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్
- కలెక్టరేట్ ఎదుట సర్పంచుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సర్పంచుల సంఘం, పంచాయతీరాజ్ చాంబర్ నాయకులు

అనంతపురం అర్బన్, మార్చి 13: రాబోవు ఎన్నికల్లో వైసీపీకి ఓట్లు వేస్తే పల్లెలు శిథిలమై, గ్రామీణ ప్రజలు నాశమైపోతారని ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. సర్పంచుల సంఘం, పంచాయతీరాజ్ చాంబర్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. దొంగిలించిన రూ.8660 కోట్లు తిరిగి ఇవ్వాలి.. సీఎం జగన్ డౌన్ డౌన్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దొంగిలించిన గ్రామ పంచాయతీలకు సంబంధించిన రూ.8660 కోట్లపై సీబీఐతో విచారణ చేయించి, తిరిగి సర్పంచుల ఖాతాలకు డబ్బు లు జమ చేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన 16 డిమాండ్లను పరిష్కరించాలని అనేక రూపాల్లో నిరసనలు చేపట్టినా ఇప్పటి దాకా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను ఉత్సవ విగ్రహాలను చేసి రాష్ట్రంలోని గ్రామ ప్రజలకు సీఎం జగన్ తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. రాబోవు ఎన్నికల్లో వైసీపీని ఓడించి, సీఎం జగన్‌ను ఇంటికి పంపేందుకు అన్ని పార్టీల సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జగన్ ఓటమితోనే మన మనుగడ నినాదంతో స్థానిక ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధి, పట్టుదలతో పనిచేయాలని కోరారు. అనంతరరం కలెక్టరేట్ ఏఓకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతాపరెడ్డి, ఉపాధ్యక్షుడు మునిరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి , నాయకులు భూషణ్, వేలూరి రంగయ్య, ప్రతాప్‌నాయుడు, ఇస్మాయిల్, ముత్యాలప్ప నాయుడు, లలితమ్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండండి

నిబంధనలు ఉల్లంఘించరాదు
రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా
ఎపిక్ కార్డులు పంపిణీ చేస్తున్నామన్న కలెక్టర్

అనంతపురం టౌన్, మార్చి 13: సాధారణ ఎన్నికల నిర్వహణకు అన్నివిధాలా సిద్ధంగా ఉండాలని ఉమ్మడి జిల్లా అధికారులను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై కలెక్టరు, ఎస్పీ, ఇతర ఎన్నికల అధికారులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల ఫిర్యాదులపై పరిశీలన పూర్తి చేసి అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. ఇంకా ఎన్ని ఫిర్యాదులు పెండింగ్ ఉన్నాయి. ఏఏ ఫాంలు ఉన్నాయెూ ఆరా తీసి వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది నియామకం, వసతులు కల్పన గురించి అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించరాదని హెచ్చరించారు. పోలీసులు భద్రత విషయంలో నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. సరిహద్దు ప్రాంతాలు. సమస్యాత్మక ప్రాంతాల పట్ల ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎప్పుడు నోటిఫికేషన్ వచ్చినా ఎన్నికల ప్రక్రియ చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అనంతపురం కలెక్టరు గౌతమి మాట్లాడుతూ ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరిస్తున్నామని అన్నారు. జిల్లాకు 2,38,849 ఎపిక్ ఓటరుకార్డులు వచ్చాయని, వాటిని ఆయా ఓటర్లకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల నిర్వహణకోసం అన్నిరకాల ఏర్పాట్లు చేపట్టి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈకాన్ఫరెన్స్‌లో ఎస్పీ అన్బురాజన్. డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి,ఆర్డీఓలు, ఆర్‌ఓలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్

కన్నీటి సిరాతో..

రోజూ పరీక్షకు తీసుకొచ్చే నాన్న
ఇక రాడని...
భయపడితే ధైర్యం చెప్పే తండ్రి
ఇక లేడని...
ఆ కుమార్తె గుండె తల్లడిల్లిపోయింది.
బాగా చదివి, గొప్పదానివి కావాలన్న
తన అబ్బాజాన్ మాటలను గుర్తుంచుకుని..
ఉబికి వస్తున్న కన్నీటి ప్రవాహానికి
ఆనకట్ట వేయలేని
కను రెప్పలు తుడుచుకుంటూ..
కాలం పెట్టిన 'పరీక్ష'ను
కన్నీటి సిరాతో రాసింది.
ఇంటికెళ్లి ధారలవుతున్న కన్నీటితో
కన్నతండ్రికి కడసారి వీడ్కోలు పలికింది.

తండ్రి మరణాన్ని జీర్ణించుకుని ఇంటర్ పరీక్ష రాసిన విద్యార్థి

తండ్రి మృతి చెందిన బాధను దిగమింగి ఇంటర్ పరీక్ష రాసిన కుమార్తెకు సంబంధించిన ఈ సంఘటన హిందూపురంలో బుధవారం జరిగింది. పట్టణంలో ఈ-టీవీ కంట్రిబ్యూటర్‌గా విధులు నిర్వహిస్తున్న వీడీ సిద్దయ్య(36) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. పెద్దకుమార్తె తస్లీం ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాస్తోంది. ఫిజిక్స్ పరీక్షకు బుధవారం హాజరు కావాల్సి ఉంది. ముందు రోజు రాత్రి విద్యార్థిని తండ్రి గుండెపోటుతో మృతి చెందారు. దీంతో ఆ కుటుంబం దుఃఖసాగరంలో మునిగిపోయింది. రోజూ పరీక్ష కేంద్రం వద్ద దించి, ధైర్యం చెప్పివెళ్లే తండ్రి దూరం కావడంతో తస్లీం కన్నీరు మున్నీరైంది. వెక్కి వెక్కి ఏడుస్తూ పరీక్ష కేంద్రానికి చేరుకుంది. తన పరిస్థితిని చూసి పలువురు కంటతడి పెట్టుకున్నారు. ఆమె పరీక్ష పూర్తిచేసి వచ్చేవరకూ సిద్దయ్య మృతదేహాన్ని అలాగే ఉంచారు. ఆమె వచ్చి కడచూపు చూసిన తరువాత అంత్యక్రియలకు తరలించారు. సిద్దయ్య మృతదేహానికి పలువురు రాజకీయ నాయకులు, అధికారులు, ప్రముఖులు, విలేకరులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.



పరీక్ష కేంద్రంలో తస్లీం

- హిందూపురం అర్బన్

నేటి నుంచి గవిమఠం ఉత్సవాలు

ఉరవకొండ, మార్చి 13: వందల ఏళ్ల విశిష్ట చరిత్ర కలిగిన గవిమఠంలోని స్థిత చంద్రమౌళీశ్వరస్వామి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏటా ఫాల్గుణ శుద్ధ దశమి రోజున మఠం ఆధ్వర్యంలో రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవ ఏర్పాట్ల పనులలో అధికారులు నిమగ్నమయ్యారు. గురువారం కంకణధారణతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 15న నాగాభరణం, 16న నెమలి వాహనోత్సవం, 17న అడ్డపల్లకి ఉత్సవం, ఐరావతవాహనోత్సవం, 18న బసవేశ్వర వాహనోత్సవం, 19న మహా రథోత్సవం, 20న లంకాదహనం, 21న అశ్వవాహనం, వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ తెలిపారు. బ్రహోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. మఠం ఆవరణంలో చలువపందిళ్లను వేయించామని ఆయన వెల్లడించారు.



ఏర్పాటు చేసిన చలువపందిళ్లు ఇన్‌సెట్‌లో చంద్రమౌళీశ్వరస్వామి

19 నుంచి ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు

కదిరి, మార్చి 13: పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 19నుంచి ఏప్రిల్ 2వరకు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల కోసం వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆలయ అధికారులు బుధవారం ఆలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సూచనలు, సలహాలు ఇచ్చారు. మొబైల్ మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. బ్రహ్మ రథోత్సవం రోజున తిరువీధులు శుభ్రంగా ఉంచడానికి మున్సిపల్ అధికారులు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు నిఘా పెంచాలన్నారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపాలని కోరారు. బ్రహ్మోత్సవాలు పూర్తి అయ్యేంతవరకు భారీ వాహనాలను పట్టణంలోకి అనుమతించకూడదని సూచించారు. రథం వెనుక మొద్దులు వేసేవారికి ఇబ్బంది లేకుండా తొక్కిసలాట జరగకుండా ప్రత్యేక రక్షణ వలయాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమానికి ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్ధారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, ఆర్డీవో వంశీకృష్ణ, డీఎస్పీ శ్రీలత, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, బీజేపీ నాయకుడు గుడిసే దేవానంద్, రొద్దం ఉత్తమరెడ్డి, తలుపుల గంగాధర్, వైసీపీ నాయకుడు వజ్రభాస్కర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు విశ్వనాథ్‌రెడ్డి, నాగమల్లు, లోకేశ్వర్‌రెడ్డి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఎంసీఏ, ఎంబీఏ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, మార్చి 13: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంసీఏ, ఎంబీఏ పరీక్షల ఫలితాలను విడుదల చేశామని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఎంసీఏ ప్రథమ సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ. (ఆర్20,17) సప్లిమెంటరీతోపాటు ద్వితీయ సెమిస్టర్(ఆర్20,21) సప్లిమెంటరీ పరీక్షలను ఫిబ్రవరిలో నిర్వహించినట్లు తెలిపారు. ఎంబీఏ ప్రథమ సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ. (ఆర్12) సప్లిమెంటరీ. ద్వితీయ సెమిస్టర్(ఆర్21,17) సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయన్నారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నేడు ఈబీసీ నేస్తం పథకం లబ్ధి విడుదల

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి13: ఈబీసీ నేస్తం పథకం మూడో విడత నిధులు గురువారం విడుదల చేయనున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం ఓ ప్రకటనలో తెలిపారు. వెనుకబడిన కులాలకు చెందిన 45 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల మహిళలకు రూ. 15 వేలు లబ్ధిని అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 20145 మంది మహిళలకు సంబంధించి రూ. 30.21 కోట్లు విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు.

రేపు రాష్ట్రస్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 13: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలను శుక్రవారం స్థానిక ఆర్డీటీ అనంత క్రీడా గ్రామంలో నిర్వహిస్తున్నట్లు ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు, కార్యదర్శి నాగేంద్ర తెలిపారు. సబ్‌జూనియర్ బాల, బాలికల కేటగిరిలలో ఈ పోటీలు ఉంటాయన్నారు. ఉమ్మడి 13 జిల్లాల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని అన్నారు. ఎంపికైన జట్లకు ఈనెల 20 నుంచి శిక్షణ ఇస్తామని, 28 నుంచి నిర్వహించే జాతీయ సబ్‌జూనియర్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 98495 53603ను సంప్రదించాలని కోరారు.

అక్రమంగా తరలిస్తున్న గోవులు పట్టివేత

పామిడి, మార్చి 13: మండలంలోని రామరాజుపల్లి గ్రామ సమీపాన 44వ జాతీయ రహదారిపై ఇతర ప్రాంతాలకు కంటైనర్‌లో అక్రమంగా తరలిస్తున్న గోవులను బీజేపీ నాయకులు పట్టుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి అనంతపురం వైపునకు ఓ కంటైనర్‌లో సుమారు 40 గోవులను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో వెంబడించి దాన్ని ఆపినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. కంటైనర్‌ను తెరిచి చూడగా అందులో దాదాపు 40వరకూ గోవులు ఉన్నట్లు గుర్తించామన్నారు. అక్రమంగా గోవులు తరలించేందుకు పాల్పడిన వారందరూ ఒక్కొక్కరుగా అక్కడి నుంచి జారుకున్నారు. దీంతో బీజేపీ నాయకులు పోలీసులకు సమాచారం చేరవేశారు. ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. గుత్తి, పామిడి బీజేపీ నాయకులు అక్రమంగా తరలిపోతున్న గోవులను పట్టుకోవడంపై హిందూ సంఘాలు హర్షం వ్యక్తంచేశాయి.



కంటైనర్‌లో తరలిస్తున్న గోవులు

రూ. 40 లక్షలతో వాటర్ ప్లాంట్ల ఏర్పాటు

- సహకారం అందించిన మన్నవ మోహనకృష్ణ

హిందూపురం, మార్చి 13: నియోజకవర్గంలో ప్రజలకు నాణ్యమైన శుద్ధ జలాలను అందించాలన్న లక్ష్యంతో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, ఎన్టీఆర్ ట్రస్టు డైరెక్టర్ మన్నవ మోహనకృష్ణ ఆర్థిక సాయంతో రూ. 40 లక్షలు వెచ్చించి నాలుగు వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధర దేవి పేర్కొన్నారు. బుధవారం చిలమత్తూరు మండలంలోని మొరంపల్లి, కోడూరు గ్రామాల్లో పట్టణంలోని ముదిరెడ్డిపల్లి, పోచనపల్లి గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయగా, వీటిని వసుంధరదేవి, మన్నవ మోహనకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వసుంధర దేవి మాట్లాడుతూ 2014లో హిందూపురానికి ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు ఖాళీ బిందెలతో తాగునీటి కోసం ప్రజలు పడిన కష్టాలను చూశాం. ఎలాగైనా నీటి ఎద్దడి తీర్చాలని సంకల్పించాం. ఈ నేపథ్యంలోనే గుంటూరుకి చెందిన మన్నవ మోహనకృష్ణ సహకారం అందించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం మోహనకృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలకృష్ణ ఈ నియోజకవర్గ ప్రజలను అన్ని రకాలుగా కాపాడుకుంటున్నారన్నారు. నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలను చేపడుతున్నార న్నారు. వైసీపీ పాలనలో ప్రజలు తాగునీటి కోసం ఎంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇలాంటి నియోజకవర్గంలో ప్రజల కు తాగునీటిని అందించే కార్యక్రమంలో తాను భాగస్వామి కావ డం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఇందుకు బాలకృష్ణకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.



ముద్దిరెడ్డిపల్లిలో తాగునీటి బిందె అందజేస్తున్న వసుంధర దేవి

ఆర్‌అండ్‌బీ ఎన్‌హెచ్ ఈఈగా సుధాకర్‌రెడ్డి

అనంతపురం సిటీ, మార్చి 13: రోడ్లు భవనాలశాఖ (ఆర్‌అండ్‌బీ) పరిధిలోని ఎన్‌హెచ్ విభాగం ఈఈగా తిరుపతిలో పనిచేస్తున్న సుధాకర్‌రెడ్డిని అనంతపురానికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న మధుసూదన్‌రావును తిరుపతికి బదిలీ చేశారు. నూతన ఈఈ సుధాకర్‌రెడ్డి గురువా రం బాధ్యతలు స్వీకరించనున్నారు. కాగా ఎన్‌హెచ్ ఎస్‌ఈ మురళీమోహన్ ఇటీవల విజయవాడకు బదిలీ అయ్యారు. కాకినాడలో పనిచేస్తున్న ఎస్‌ఈ హరిప్రసాద్ ఇక్కడికి బదిలీ చేశారు. దీంతో ఆయన బుధవారం స్థానిక ఆశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆశాఖ అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.26 వేలు

అనంతపురంరూరల్, మార్చి 13: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.26 వేలు, కనిష్ఠంగా రూ.9 వేలు, సరాసరి రూ.16 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 363 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు ఆమె వెల్లడించారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి



ప్రచారం చేస్తున్న కందికుంట యశోదమ్మ

9వ వార్డులో కందికుంట యశోదమ్మ ప్రచారం

కదిరి, మార్చి 13: పట్టణంలోని 9వ వార్డులో బుధవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ సతీమణి కందికుంట యశోదమ్మ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల్ని ఆప్యాయంగా పలకరిస్తూ.. సూప ర్‌సిక్స్ పథకాలపై తెలియజేశారు. ఈ పథకాల వల్ల అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. తొలుత వార్డు ప్రజలు ఆమెకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి

● మండల సమావేశంలో టీడీపీ ఎంపీటీసీ సభ్యుడి డిమాండ్

ఓబుళదేవరచెరువు, మార్చి 13: వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్తును ఇవ్వ డంతో పాటు పగ టి పూటే సరఫరా చేయాలని టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు బోయ ముతక శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం లో బుధవారం ఎంపీపీ తుమ్మల పర్వీన్ షామీర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో విద్యుత్ ఏఈ రామసూరారెడ్డి మాట్లాడుతుండగా.. ఎంపీటీసీ శ్రీనివాసులు జోక్యం చేసుకుని గత టీడీపీ ప్రభుత్వంలో వ్యవసాయానికి 9గంటల పాటు విద్యుత్ అందించారని, ప్రస్తుత ప్రభుత్వం 7గంటలు మాత్రమే ఇస్తోందని వాపోయారు. అదికూడా సరిగా సరఫరా కావడం లేదన్నారు. ఇప్పటికైనా నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని, అలాగే పగటి పూట సరఫరా చేసి రైతులను ఆదుకో వాలని కోరారు. స్పందించిన ఏఈ పగటిపూట విద్యుత్ సరఫరా తమ చేతుల్లో లేదని, విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు. అనంతరం వివిధ శాఖలవారీగా సమీక్షించారు. సమావేశంలో తహసీల్దార్ ఖాజాబీ, ఎంపీడీఓ వరలక్ష్మి, జడ్పీటీసీ కుర్లి దామోదర్‌రెడ్డి, ఈఓఆర్డీ రాజశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దీపిక, గృహనిర్మాణ శాఖ ఏఈ నాగభూషణం, హార్టికల్చర్ లావణ్య, పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, ఏఓ ఇలియాజ్ అహమ్మద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో పోషణ్ అభియాన్

తనకల్లు, మార్చి 13: అంగన్‌వాడీ సేవలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీకుమారి పేర్కొన్నా రు. మండలంలోని గొల్లపల్లిలో బుధవారం నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ముఖ్యంగా గర్భిణులు, కౌమార దశ బాలికలు చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కాన్వెంట్లు వద్దు .. అంగన్‌వాడీలు ముద్దు అని గ్రామాల్లో ప్రజలకు తెలియజే యాలని సిబ్బందికి తెలిపారు. అంగన్‌వాడీకేంద్రాల్లో ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాల ను వివరించారు. తర్వాత వంటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ గంగరత్న, సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ, కార్యకర్త గంగరత్న, గ్రామస్థులు, తల్లులు చిన్నారులు పాల్గొన్నారు.



చిన్నారికి చిరుధాన్యాల ఆహారం తినిపిస్తున్న పీడీ తదితరులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ధర్మవరంరూరల్, మార్చి13: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఓ యువకుడి దుర్మరణం చెందిన సంఘటన మండలంలోని చిగిచెర్ల వద్ద చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు బుధవారం తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ధర్మవరం పట్టణం లోనికోటకు చెందిన ఓబులనేని మల్లికార్జున, దేవి దంపతుల కుమారుడు దుర్గాప్రసాద్ (24) ద్విచక్రవాహనంలో మంగళవారం రాత్రి ధర్మవరం నుంచి అనంతపురానికి బయలుదేరాడు. కాగా మార్గ మధ్యంలోని చిగిచెర్ల గ్రామసమీపంలో మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డుపక్కన గుంతలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో దుర్గాప్రసాద్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు బుధ వారం ఉదయం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు. కాగా ఇటీవల కాలంలో చిగిచెర్ల క్రాస్ సమీపంలో వరుసగా ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాతపడుతున్నా అధికారులు, పోలీసులు చర్యలు చేపట్టలేదని గ్రామస్థులు మండి పడుతున్నారు. చిగిచెర్ల క్రాస్ సమీపంలో స్పీడ్‌బ్రేకర్లు వద్ద, మలుపుల వద్ద ఎటువంటి సూచిక బోర్డులు లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా స్పందించి సూచికబోర్డులు ఏర్పాటుచేయాలని వారు కోరుతున్నారు.



దుర్గాప్రసాద్ (ఫైల్)

నంబులపూలకుంటలో వికసిత్ భారత్ యాత్ర

నంబులపూల కుంట, మార్చి 13: మండల కేంద్రంలో బుధవారం బీజేపీ నాయకులు వికసిత్‌భారత్ సంకల్ప యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో సమావేశమయ్యారు. పార్టీ మైనార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబ్‌జాన్ మాట్లాడుతూ నరేంద్రమోదీని మరోసారి ప్రధానమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. ఆయన పీఎం అయితేనే అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కేంద్రంలో పదేళ్ల మోదీ పాలనలో జరిగిన పనులు, పథకాలను ప్రజలకు ఎల్‌ఈడీ ద్వారా వివరించారు. రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి కూడా అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అశోక్, మండల అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, నాయకులు చాంద్‌బాషా, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేంద్రం పథకాలపై అవగాహన కల్పిస్తున్న బీజేపీ నాయకులు

నల్లచెరువులో పోలీసుల కవాతు



నల్లచెరువులో కవాతు చేస్తున్న పోలీసులు

నల్లచెరువు, మార్చి 13: త్వరలో ఎన్నికలు జరగనున్న దృష్ట్యా మండలకేంద్రంలో బుధవారం ఎస్‌ఐ కేఎం లింగన్న ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నుంచి ప్రారంభమైన కవాతు బస్టాండ్, బసవన్నకట్ట మీదుగా పురవీధుల గుండా సాగింది. ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి ఆందోళనలకు ప్రశాంతంగా ఓటు వినియోగించుకోవాలనే ఈ కవాతు నిర్వహించామని ఎస్‌ఐ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ షెక్షావలి, సిబ్బంది, ప్రత్యేక బలగాలు పాల్గొన్నారు.

కోటపల్లి దళితవాడలో తాగునీటి ఎద్దడి

● పశువుల నీటి తొట్టెను ఆశ్రయిస్తున్న స్థానికులు ● పట్టించుకోని అధికారులు

తనకల్లు, మార్చి 13: మండలంలోని కోటపల్లి దళితవాడలో ప్రజలు గుక్కెడు నీరు లేక దాహార్తి తో విలవిల్లాడుతున్నారు. చేసేదిలేక గ్రామం బయ ట పశువుల దాహార్తి తీర్చడానికి ఏర్పాటు చేసిన నీటి తొట్టివద్ద నీటిని పట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని మహిళలు ఆవేదన చెందుతున్నారు. గత నెలరోజుల నుంచి తాగునీటి సమస్య ఏర్పడిందంటున్నారు. బోర్లు ఎండిపోవడంతో నీరు సక్రమంగా రాలేదంటున్నారు. సమస్యను అధికారులకు చెప్పి నా.. పట్టించుకోలేదని, ముఖ్యంగా పంచాయతీ కా ర్యదర్శికానీ, ఈఓఆర్డీకానీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులుకు పలుమార్లు విన్నవించామని, ఇంతవరకు ఎవరూ స్పందించలేదని ఆగ్రహిస్తున్నారు. ప్రతిరోజు తాము నీటికోసం ఇబ్బందులు పడుతున్నా.. అధికారులు, సచివాలయ సిబ్బంది చూస్తూ వెళుతున్నారే కానీ.. సమస్యను పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన చెందుతున్నారు. అసవే వేసవి అని, నీరు లేక అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు. వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. లేకపోతే ఆందోళనలు చేపడామని వారు హెచ్చరిస్తున్నారు.



పశువుల తొట్టె నుంచి నీటిని తెచ్చుకుంటున్న దళితవాడ వాసులు

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి



మొల్ల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న డీఆర్వో కొండయ్య

పుట్టపర్తి రూరల్, మార్చి 13: తొలి తెలుగుకవయిత్రి మొల్ల జయంతి వేడుకలను పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాధవరెడ్డి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ విలువలతో కూడిన కవిత్వాన్ని సమాజానికి అందించడంలో కవయిత్రి మొల్ల ప్రత్యేకతని కొనియాడారు. రామాయణాన్ని వివిధ భా షల్లో ఎందరో రచించారని, వాల్మీకి మహర్షి రచించిన రామాయణాన్ని మొల్లమాంబ తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో తెలుగుభాషలో రచించడం గర్వించదగ్గ విషయమని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, సైబర్ క్రైం సీఐ హేమంత్‌కుమార్, ఆర్‌ఐలు చంద్రశేఖర్, వలి, సూపరింటెండెంట్ సరస్వతి, సిబ్బంది నాగరాజు, మురళి, శీనా, ఆర్ఎస్సై సుబ్బారెడ్డి, ఏఆర్ ఎస్సైలు శ్రీరాములు, షామీర్, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి: తెలుగుకవయిత్రి మల్లమాంబ జయంతి వేడుకలను కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. డీఆర్వో కొండయ్య ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రామాణాన్ని తెలుగులో రచించిన ఘనత మల్లమాంబదేనన్నారు. ఎస్సీసంక్షేమశాఖ అధికారి శివరంగప్రసాద్, బీసీసంక్షేమశాఖ అధికారి నిర్మలాజ్యోతి, కుమ్మరిసంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

బుక్కపట్నం, మార్చి 13: మండలంలోని పాముదుర్తి గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పుట్టపర్తికి చెందిన ఖిద్మత్ ఏకల్ ఛారిటబుల్ ట్రస్టు వారు బుధవారం పరీక్ష సామగ్రిని అందించారు. ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అట్టలు, పెన్నులు తదితర పరీక్ష సామగ్రిని అందించామన్నారు. కార్యక్రమంలో సభ్యుడు షామీర్, హెచ్‌ఎం చెన్నక్రిష్టారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠ

నల్లమాడ, మార్చి 13: మండలకేంద్రంలోని ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలలో బుధవారం సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. వేదపండితులు వేద మంత్రోచ్చారణలతో విగ్రహ ప్రతిష్ఠ గావించారు. ఎంఈఓలు వేమనారాయణ, రమేష్‌బాబులు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. పాఠశాలలో సరస్వతి దేవిగ్రహం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు విద్యార్థులు రోజూ అమ్మవారిని పూజించి తరువాత చదువుకోవాలని సూచించారు. హెచ్‌ఎం సతీష్ ,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పది పరీక్ష కేంద్రం మార్పు

● విద్యార్థులు ఇబ్బంది పడుతారంటున్న తల్లిదండ్రులు

నల్లచెరువు, మార్చి 13: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పది పరీక్షలు నిర్వహించడం ప్రతి ఏడాదీ జరుగుతోంది. అయితే ఈసారి మోడల్ స్కూల్లో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం మండలకేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడికి విద్యార్థులు వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. గత 25 ఏళ్ల నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పరీక్షలు రాయడానికి అన్ని సౌకర్యాలు ఉన్నాయి. అయితే ఇప్పుడు సరిపడా టేబుళ్లు లేవన్న కారణంగా పరీక్ష కేంద్రాన్ని మోడల్ స్కూల్‌కు మార్చడం ఏంటని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఈ కేంద్రంలో 280 మంది పరీక్షలు రాయనున్నారు. వారంగా మోడల్ స్కూల్ వద్దకు వెళ్లాలంటే ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో పాటు బస్సు సౌకర్యం లేదని, దీంతో ఇబ్బందులు ఎదురవుతాయని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పరీక్షకేంద్రాన్ని జిల్లా పరిషత్ పాఠశాలలోనే కొనసాగించాలని వారు కోరుతున్నారు.

పాలపాటిదిన్నె ఆలయ ఈఓగా షరీఫ్

నల్లచెరువు, మార్చి 13: మండలంలోని పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయ నూతన ఈఓగా షరీఫ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన ఈఓ రామాంజనేయులు బదిలీపై అనంతపురం వెళ్లారు. గండి ఆంజనేయస్వామి ఆలయంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న షరీఫ్ పదోన్నతిపై పాలపాటి దిన్నె ఈఓగా వచ్చారు. బాధ్యతలు తీసుకోగానే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయకమిటీ ఛైర్మన్ భాస్కర్ రెడ్డి, సభ్యుడు సూర్యనారాయణ, అర్చకులు నాగరాజు, సంజీవ్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

కళాశాలను తనిఖీ చేసిన ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్

చిలమత్తూరు, మార్చి 13: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ సౌరబ్ గౌర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలలో ఇంటర్మీ డియేట్ పరీక్షలు నిర్వహిస్తున్న గదులను పరిశీలించారు. విద్యార్థులకు అన్ని వసతులు ఉన్నాయా? లేదా? అనే విషయాలపై ఆరా తీసారు. అనంతరం రికార్డులను పరిశీలించి, ఆన్‌లైన్ అటెండెన్స్‌పై ఆరా తీశారు. పరీక్షల నిర్వహణ లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కళాశాల ప్రిన్సిపాల్ నాగ రాజుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డీవైఈఓ రఘునాథ రెడ్డి, ఆర్ఐఓ సురేష్‌బాబు, కళాశాల అధ్యాపకులు ఉన్నారు.

వైభవంగా జ్యోతుల మహోత్సవం

ధర్మవరం రూరల్, మార్చి 13: కనగానపల్లి మండలంలోని దాదులూరు పోతలయ్యస్వామికి జ్యోతుల బోనాలు ఉత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. జాతర మహోత్సవంలో భాగంగా పోతురాజులు జలధిపూజ చేసి పోతలయ్య స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు జ్యోతుల బోనాలను సమర్పించి ఆలయం చుట్టూ పలహారపు బండ్ల ప్రదర్శన చేపట్టారు. పోతలయ్యస్వామితో పాటు బంగారు లింగమయ్యస్వామి, చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరణ చేశారు. గురువారం గావుల మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.





విద్యుత్ దీపాల అలంకరణలో దాదులూరు పోతలయ్యస్వామి ఆలయం , (ఇన్‌సెట్లో) అలంకరణలో పోతలయ్యస్వామి,

పాఠశాల పక్కన పేరుకుపోయిన చెత్త

● వెదజల్లుతున్న దుర్గంధం ● అసౌకర్యానికి గురవుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

గాండ్లపెంట, మార్చి 13: మండలకేంద్రంలోని ప్రధాన రహదారిలో గల ఉన్నత పాఠశాల ప్రహరీ పక్కన చెత్త పేరుకుపోయింది. దీంతో వాటి నుంచి దుర్గంధం వెదజల్లుతుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అసౌకర్యానికి గురవుతున్నారు. నిత్యం పంచాయతీ అధికారులు ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తుంటారని, వారికి ఈ చెత్త కనిపించడం లేదా అంటూ ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. ప్రధాన రహదారి పక్కన, సచివాలయానికి కూత వేటు దూరంలో పాఠశాల వద్ద స్థానికులు చెత్తాచెదారం పడేస్తున్నా.. అధికారులు చూసీ చూడనట్లు వెళుతున్నారని ఆవేదన చెందుతున్నారు. ఇలా ఉంటే పాఠశాలకు విద్యార్థులు ఎలా వస్తారని ఆగ్రహిస్తున్నారు. పంచాయతీ అధికారులు ఇప్పటికైనా స్పందించి చెత్తను తొలగించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వారు కోరుతున్నారు.



పాఠశాల ప్రహరీ వద్ద పేరుకుపోయిన చెత్త

ప్రజలను చీల్చే చట్టాలను ఉపసంహరించుకోవాలి

● సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్

పుట్టపర్తి రూరల్, మార్చి 13: ప్రజలను చీల్చే చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంభూపాల్ కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ప్రజల మధ్య ఐక్యతను చెడగొట్టే విధంగా సీఏఏ బిల్లుకు చట్టపరంగా గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి 200 పిటీషన్లు పెండింగులో, 200పిటీషన్లు విచారణలో ఉన్నాయని, అయితే సుప్రీంకోర్టును బేఖాతరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్లను ఎలా విడుదల చేస్తుందని ప్రశ్నించారు. తర్వాత పార్టీ కార్యాలయం నుంచి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వరకు వరకు ర్యాలీ నిర్వహించారు. సీనియర్ నేత బడా సుబ్బిరెడ్డి, జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, జిల్లాకార్యవర్గ సభ్యులు ఈఎస్ వెంకటేసు, పెద్దన్న, కమిటీ సభ్యులు నరసింహులు, శ్రీనివాసులు, జంగాలపల్లి పెద్దన్న, లక్ష్మీనారాయణ, రైతుసంఘం నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంభూపాల్

విద్యార్థులతో బేరసారాలపై ఫిర్యాదు

కొత్తచెరువు, మార్చి 13: ఓపెన్‌స్కూళ్లకు సంబంధించిన విద్యార్థులను పది పరీక్షల్లో పాస్ చేయిస్తామని చెప్పి ఆయా స్కూళ్ల నిర్వాహకులు డబ్బులు వసూలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం మండలకేంద్రంలోని డీఈఓ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు ఓపెన్‌స్కూళ్ల కో ఆర్డినేటర్ లాజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓపెన్ స్కూళ్ల విద్యార్థులకు కూడా ఈనెల 18వ తేదీ నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నాయని, కాగా ఇందులో పాస్ చేపిస్తామంటూ ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.12వేల నుంచి రూ.15వేల వరకు ఆయా స్కూళ్ల నిర్వాహకులు బేరాలాడుతున్నారని తెలిపారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కదిరి, హిందూపురం ప్రాంతాలలో ఇలాంటి దందాలు జరుగుతున్నాయన్నారు. వీటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు నాగార్జున, బాబ్జాన్, వీరేశ్, హర్షకుమార్, హరి, భగత్ పాల్గొన్నారు.

గోనుగుంట్ల ఆర్థికసాయం

ముదిగుబ్బ, మార్చి 13: మండలంలోని సానేవారిపల్లి గ్రామానికి చెందిన గంగులప్పకు మాజీఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. గంగులప్ప భార్య వెంకటలక్ష్మికి ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. దీంతో వైద్యఖర్చులకు వారు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న గోనుగుంట్లసూర్యనారాయణ అనంతపురంలోని తన కార్యాలయంలో గంగులప్పకు వైద్యఖర్చులకోసం రూ.15వేలు ఆర్థికసాయం అందజేశారు.



గంగులప్పకు ఆర్థిక సాయం అందజేస్తున్న గోనుగుంట్ల

18 నుంచి ఒంటిపూట బడులు

ధర్మవరం, మార్చి 13: ఈనెల 18వ తేదీ నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటిపూట బడులు నిర్వహిస్తామని ఎంఈఓ-1 రాజేశ్వరి, ఎంఈఓ-2గోపాల్‌నాయక్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ఉంటాయని, కావున పాఠశాలల్లో ఒంటిపూట బడులు నిర్వహిస్తామన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాఠశాలలు జరుగుతాయన్నారు. పాఠశాలలో అదనపు తరగతులు నిర్వహించరాదన్నారు. వేసవికాలం కావడంతో విద్యార్థులు వడదెబ్బకు గురికాకుండా ఉపాధ్యాయులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఘనంగా ఉత్సవాలు

పుట్టపర్తి, మార్చి 13: పట్టణంలోని పెద్ద కమ్మవారిపల్లి చింతతోపులో చెన్నకేశవస్వా మి, పోతులప్ప ఉత్సవాలను బుధవారం ఘ నంగా నిర్వహించారు. మొదట నిర్వాహకులు చెన్నకేశవస్వామికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

హై ఓల్టేజీతో టీవీలు దగ్ధం

పుట్టపర్తి, మార్చి 13: జిల్లా కేంద్రంలోని ఎనుములపల్లిలో బుధవారం హై ఓల్టేజీతో పలు గృహాలలోని టీవీలు, ఫ్రిజ్ లు, కంప్యూటర్లు దగ్ధమయ్యాయి. అలాగే ఎనుములపల్లి వార్డు సచివాలయంలోనూ కంప్యూటర్, ఇన్వెర్టర్, ఫ్యాన్లు, కుర్చీలు దగ్ధమయ్యాయి. నష్టం రూ.లక్షల్లో ఉంటుందని బాధితులు వాపోయారు. ఎనుములపల్లి సెల్ సబ్‌సెంటర్ వద్ద రెండు హైటెన్షన్ వైర్లు జాయింట్ కావడంతో ఈ ప్రమాదం జరిగిందని విద్యుత్ సిబ్బంది పేర్కొన్నారు.

వంట గ్యాస్ సిలిండర్ల సీజ్

అనంతపురం న్యూటౌన్, మార్చి13: ఉమ్మడి జిల్లాలో విజిలెన్స్ అధికారులు ముమ్మర దాడులు నిర్వహించారు. అందులో భాగంగా బుధవారం శ్రీసత్యసాయి జిల్లా బత్తలప ల్లి మండలకేంద్రంలోని కదిరి రోడ్డులో గల కాకతీయ రెస్టారెంట్‌లో తనిఖీలు చేపట్టారు. అక్క డ నిబంధనలకు విరుద్ధంగా ఇంటి అవసరాల కు వినియోగించాల్సిన వంటగ్యాస్ సిలిండర్లను కమర్షియల్‌కు వినియోగిస్తుండడంతో 7 సిలిండర్లను సీజ్ చేశారు. నిర్వాహకుడు గుణశేఖర్‌పై కేసు నమోదు చేశారు. తనిఖీలో ఎస్‌ఐ ఫణీంద్రనాథ్‌రెడ్డి, ఏఓ వాసుప్రకాష్, బత్తలపల్లి సీఎస్‌డీటీ శారద తదితరులు పాల్గొన్నారు

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

ధర్మవరం, మార్చి 13: పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవపురంలో గల యశోద కాన్సెప్ట్ స్కూల్లో బుధవారం విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర పర్యవేక్షణ అధికారి ప్రభ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు ఎకో క్లబ్స్ ఆవశ్యకత, లైఫ్ స్కిల్స్, మొక్కలను పెంచాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. పరిసర ప్రాంతాలలో మొక్కలను తప్పనిసరిగా నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్‌నాయక్, నేషనల్ గ్రీన్‌కోర్ జిల్లా కోఆర్డినేటర్ నాగ అనిల్‌కుమార్, క్లస్టర్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్, ప్రిన్సిపాల్ అనూప్ తదితరులు పాల్గొన్నారు.

వీధిదీపాలు వేయలేని అసమర్థ ప్రభుత్వం



మునిమడుగులో ప్రచారం చేపట్టిన సవిత

- వైసీపీ పాలనపై టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత విమర్శ
- మునిమడుగు నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభం

పెనుకొండ రూరల్, మార్చి 13 : టీడీపీ హయాంలోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాయని, గ్రామాల్లో వీధిదీపాలు వేయలేని అసమర్థ ప్రభుత్వం వైసీపీదని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వైసీపీదన్నారు. బుధవారం టీడీపీ, జనసేన కార్యకర్తలతో మండలంలోని మునిమడుగు, గుట్టూరు, అమ్మవారిపల్లి, మోటువారిపల్లి, చిన్నపరెడ్డిపల్లి, కురుబవాండ్లపల్లి గ్రామాల్లో భారీ జనసంద్రం మధ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో సవితకు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. ఆమె గ్రామంలోని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. అలాగే రామాలయం తదితర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సవిత మాట్లాడుతూ ... టీడీపీ ఆవిర్భావం నుంచి మునిమడుగు గ్రామం నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. గతంలో అంధకారంలో ఉన్న ఈ గ్రామానికి తమ తండ్రి ఎస్ రామచంద్రారెడ్డి విద్యుత్ ఏర్పాటుచేశారన్నారు. అర్హులైన నిరుపేదలకు వందల్లో ఇంటిపట్టాలు ఇచ్చారన్నారు. పరిటాల రవీంద్ర ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రోడ్లు, డ్రైనేజీ, కమ్యూనిటీ భవనాలు నిర్మించారన్నారు. చెరువుకట్ట తెగిపోతుందన్న సమయంలో మరమ్మతులు చేయించి రైతులకు సాగునీరు అందించారన్నారు. అభివృద్ధి జరిగిందంటే ఒక్క తెలుగుదేశం హయాంలోనే అన్నారు. తన తరపున ప్రచారానికి కర్ణాటక ప్రాంతం నుంచి ఎవరూ రాలేదని స్థానికంగా ఓటు హక్కు ఉన్నవారే వచ్చారన్నారు. పెనుకొండ వైసీపీ అభ్యర్థి నాన్‌లోకల్‌అని తాను పక్కా లోకల్ అన్నారు. ప్రజలకు ఏ అవసరమొచ్చినా అందుబాటులో ఉంటానన్నారు. కళ్యాణదుర్గంలో ఛీ కొడితే ఓ వలస పక్షి ఇక్కడికి వచ్చిందని, పెనుకొండను దోచేందుకే అన్నారు. పెనుకొండలో ప్రజలు వైసీపీ నాయకుల మాటలు నమ్మరన్నారు. పెనుకొండ కోటపై మళ్లీ టీడీపీ జెండా ఎగురవేస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు కృషితో కియ పరిశ్రమ వచ్చిందన్నారు. ప్రాంతం అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలు రావాలన్నారు. మునిమడుగు గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ, ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్లు నిర్మిస్తామని, గుట్టూరులో వాల్మీకి భవన్ నిర్మిస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

టీడీపీలోకి పలువురి చేరిక: ఎన్నికల ప్రచారంలో భాగంగా గుట్టూరు వెళ్లిన సవిత సమక్షంలో బుధవారం వైసీపీ నుంచి టీడీపీలోకి గ్రామంలోని పలు కుటుంబాలు చేరాయి. గ్రామానికి చెందిన సుబ్బరాయుడు, వేణుగోపాల్, లక్ష్మీ, కే వెంకటేశ్, వెంకటరెడ్డి, అరుణ తదితరులకు సవిత పార్టీ కండువాకప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, మునిమడుగు చిన్నవెంకటరాముడు, సూర్యనారాయణ, బోయనాగరాజు, మల్లికార్జున, టీడీపీ అధికార ప్రతినిధి రఘువీరారెడ్డి, రమేష్‌నాయుడు, వాసుదేవరెడ్డి, పోతిరెడ్డి, రామలింగ, గోవిందరాజులు, బైలప్ప, బాలకృష్ణచౌదరి, ఉత్తంరెడ్డి, నరేష్, వెంకటేశ్‌రెడ్డి, జనసేన సమన్వయకర్త ఈడిగ కుమార్, తెలుగు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయస్వామి మండపం ఏర్పాటు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న స్వామి విగ్రహం

హిందూపురం అర్బన్, మార్చి 13: పట్టణ పరిధిలోని బెంగళూరు రోడ్డులో ఉన్న వాల్మీకి దేవాలయం ముందు భాగంలో పంచముఖ ఆజనేయస్వామి విగ్రహం ప్రతిష్ఠించేందుకు మండపాన్ని ఏర్పాటు చేశారు. కర్ణాటకలోని రాజానుకుంటలో విగ్రహాన్ని తయారు చేయించి బుధవారం తీసుకొచ్చారు. దాతల సహకారం రూ. 1.80 లక్షలతో మండపాన్ని, పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని చేయించారు. అదే విధంగా త్వరలో వాల్మీకి కులస్థులు, దాతల సహకారంతో ఆలయంలో నూతనంగా వాల్మీకి, శివపార్వతులు, సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, నవగ్రహా లు, నాగుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, కోశాధికారి బీఎన్ మూర్తి తెలిపారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు వీఎన్ కృష్ణ, ఉపాధ్యక్షుడు కాలవరాము, కార్యదర్శి విజయ్ కుమార్, సాయిరాం, దేవరాజు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న టీడీపీ నాయకుడు జయప్ప

లేపాక్షి, మార్చి 13: మండలంలోని కొండూరు పంచాయతీ వడ్డిపల్లిలో వెలసిన అతిపురాతన మాచమ్మ దేవాలయం అభివృద్ధికి టీడీపీ మండల కన్వీనర్ జయప్ప రూ.10వేలు విరాళాన్ని అందించారు. ఆలయ మరమ్మతుల కోసం చందాలు సేకరిస్తున్న విషయం తెలుసుకున్న ఆయన స్పందించి బుధవారం రూ.10వేలు నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. కమిటీ సభ్యులు, వడ్డిపల్లి గ్రామస్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయ్

ఓబీసీ రాష్ట్ర నాయకుడు చలపతి



దాడిలో గాయపడిన చంద్రను పరామర్శిస్తున్న చలపతి తదితరులు

హిందూపురం అర్బన్, మార్చి 13: వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయని ఓబీసీ రాష్ట్ర నాయకుడు చలపతి పేర్కొన్నారు. వైసీపీ శ్రేణుల దాడిలో తీవ్రంగా గాయపడి హిందూపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చంద్రను ఆయన బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సోమందేపల్లిలో సోమవారం రాత్రి వైసీపీ మూకలు బీజేపీ కార్యకర్త చంద్రపై దాడిచేసి తీవ్రంగా కొట్టారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓడిపోతామనే డిప్రెషన్‌లోకి వైసీపీ వారు వెళ్లారన్నారు. రాష్ట్ర మంతా ఒకవైపే చూస్తోందని దీన్ని వైసీపీ నాయకులు, కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారన్నారు. ఇంక ఎన్నో రోజులు వారి ఆటలు సాగవని, ఈ వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఓబీసీ నాయకులు జగదీష్, నాగరాజు, రమేష్ వాసు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ వైద్యుడికి ఉద్యోగోన్నతి

గోరంట్ల, మార్చి 13: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్, చిన్నపిల్లల వైద్యునిపుణులు డాక్టర్ శివకుమార్‌కు ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి కల్పిస్తూ, ఆయనను గోరంట్ల నుంచి హిందూపురం జిల్లా వైద్యశాలకు బదిలీ చేశారు. హిందూపురం జిల్లా వైద్యశాలలో పనిచేస్తున్న చిన్నపిల్లల వైద్యురాలు డాక్టర్ కీర్తిని గోరంట్లకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అనారోగ్యంతో వృద్ధురాలి మృతి



వృద్ధురాలి మృతదేహం

రొద్దం, మార్చి 13 : మండలంలోని తురకలాపట్నం గ్రామం ఎస్సీ కాలనీ లో నివాసముంటున్న మంజుల (65) అనే అనాథ వృద్ధురాలు మృతిచెందింది. ఆమె చాలా ఏళ్ల కిందట గుడిబండ నుంచి తురకలా పట్నం వచ్చి ఎస్సీకాలనీలో అద్దె ఇంట్లో ఒంటరిగా ఉండేది. అయితే మంగళవారం రాత్రి సమయంలో అస్వస్థతకు గురై మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. తురకలాపట్నంలో ఎవరైనా మృతిచెందితే ఆ రాత్రి కథలు, పాటలు పాడుతూ కాలం గడిపేదన్నారు. ఆమె గురించి పూర్తి వివరాలు తెలియవన్నారు. దీంతో మంజుల మృతి విషయం బంధువులకు తెలియజేయడానికిగాను పోలీసులు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

ఇప్పటికైనా రెఫర్‌లు ఆగేనా..?



హిందూపురం ప్రభుత్వాసుపత్రి

- హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్యులు, సిబ్బంది

హిందూపురం అర్బన్, మార్చి 13: ఉమ్మడి అనంతపురం జిల్లాలో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి మంచి గుర్తింపు ఉంది. అనంతపురం ప్రభుత్వాసుపత్రి తరువాత అంతటి స్థానం హిందూ పురం ప్రభుత్వాసుపత్రికి ఉంది. ఇంతకు మునుపు పురం ఆసుపత్రిలో వైద్యులు, నర్సింగ్ స్టాఫ్, క్లరికల్ స్టాఫ్ కొరత ఉండేది. ఇటీవల అన్ని పోస్టులను భర్తీ చేశారు. దీంతో ప్రస్తుతం ఆసుపత్రిలో సిబ్బంది నిండుకుండలా ఉంది. అయితే ఇప్పటికైనా వైద్యులు సక్రమంగా విధులు నిర్వహిస్తారా అనే అనుమానాలు పలువురి నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇంతకు మునుపు గైనిక్ వార్డులో చీటికీ మాటికీ ఇతర ఆసుపత్రులకు రెఫర్‌చేసేవారు. కారణం అడిగితే స్టాఫ్ తక్కువగా ఉందని, శక్తికి మించి ఆపరేషన్లు, డెలివరీలు చేస్తున్నామనేవారు. గతంలో గైనిక్ వార్డులో ఇద్దరు వైద్యులు ఉండే వారు, కొద్ది రోజుల కిందట మరో వైద్యుడు వచ్చాడు. దీంతో ఆసుపత్రిలో ప్రస్తుతం ఒక సివిల్ సర్జన్, ఒక డిప్యూటీ సర్జన్, ఇద్దరు సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లు, ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు ఉన్నారు. ఈ ప్రకారం రోజుకు ఒకరికి ఒక్క కేసు ప్రకారం రోజుకు ఐదు కేసులు టేకప్ చేయవచ్చు. ఈ మేరకు నెలకు 150 వరకు డెలివరీలు హిందూపురం ప్రభుత్వాసుపత్రిలోనే జరగాలి. అలా కాకుండా గతంలో మాదిరి మరలా అనంతపురానికి రెఫర్ చేయడమో లేదా ప్రైవేట్ క్లినిక్‌లకు రమ్మనే పద్ధతి మానుకుంటారా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం వైద్యులు పూర్తిస్థాయిలో ఉన్నారు కనుక రెఫర్‌లు చేస్తే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు మాట్లాడుకోవడం విశేషం.

కనిపించని అనస్థీషియా వైద్యులు?

సాధారణంగా ఆపరేషన్‌లు చేసే సమయంలో మత్తు మందు ఇచ్చే వైద్యులు కీలకం. ఆపరేషన్ మొదలైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు వారు రోగుల దగ్గరే ఉండాలి. హిందూపురం ప్రభుత్వా సుపత్రిలో ఇద్దరు అనస్థీషియా వైద్యులు ఉన్నారు. కానీ వారు ఎక్కువగా బయట ప్రైవేట్ ఆసుపత్రు ల్లో బిజీగా ఉంటారని ఆసుపత్రి వర్గాలే చర్చించుకుంటుంటారు. ఉన్నతాధికారులు దీనిపైన పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు మాట్లాడుకోవడం విశేషం.

ఆదివారం వస్తే అవస్థలే..!

మిగతా రోజులు ఒక ఎత్తయితే ఆదివారం వస్తే చాలు ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండరు. కేవలం ఎమర్జన్సీలో డ్యూటీ డాక్టర్ ఉంటారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్సలు అందించి మెరుగైన వైద్యం పేరుతో రెఫర్‌లు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా నర్సింగ్ సిబ్బంది బాధ్యతగా మసులుకోవడం లేదని, రోగులతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే అపవాదు లేకపోలేదు. కొన్ని సందర్భాల్లో ప్రజలు గొడవలకు దిగిన సంఘటనలు ఉన్నాయి. ఏది ఏమైనా స్టాఫ్ ఫుల్, రెఫర్‌లు నిల్ అని పించుకుని, ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తం కాకుండా వ్యవహరిస్తారో లేదో వేచి చూడాల్సిందే.

కళాశాలను తనిఖీ చేసిన ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్



కళాశాలలో అధ్యాపకులతో మాట్లాడుతున్న ఇంటర్ బోర్డు కమిషనర్

చిలమత్తూరు, మార్చి 13: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ సౌరబ్ గౌర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలలో ఇంటర్మీడియేట్ పరీక్షలు నిర్వహిస్తున్న గదులను పరిశీలించారు. విద్యార్థులకు అన్ని వసతులు ఉన్నాయా? లేదా? అనే విషయాలపై ఆరా తీసారు. అనంతరం రికార్డులను పరిశీలించి, ఆన్‌లైన్ అటెండెన్స్‌పై ఆరా తీశారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డీవైఈఓ రఘునాథ రెడ్డి, ఆర్ఐఓ సురేష్‌బాబు, కళాశాల అధ్యాపకులు ఉన్నారు.

వైసీపీ యువజన విభాగ నాయకుడిపై దాడి

పెన్నానదిలో ఘటన

హిందూపురం, మార్చి13: వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు వాల్మీకి లోకేశ్‌పై బుధవారం సాయంత్రం గుర్తు తెలియని దుండగులు బీర్ బాటిల్‌తో దాడి చేశారు. వాల్మీకి లోకేశ్ అతడి అనుచరుడు షేక్షావలి, అమర్‌నాథ్‌రెడ్డితో కలిసి మండలంలోని మణేసముద్రం గ్రామానికి వెళ్లి హిందూపురం వచ్చారు. లోకేశ్, షేక్షావలి ముద్దిరెడ్డిపల్లి సమీపంలో పెన్నానది పరివాహక ప్రాంతానికి వెళ్లారు. ఈ సందర్భంలో గుర్తు తెలియని వ్యక్తులు బీరు బాటిల్‌తో వాల్మీకి లోకేశ్‌పై దాడి చేయగా అతడి తలకు, ఎడమచేతికి గాయాలయ్యాయి. అయితే బీరు బాటిల్‌తో పొడవడానికి ప్రయత్నించే సమయంలో అతడి వెంటఉన్న షేక్షా అడ్డుకునేం దుకు ప్రయత్నించగా షేక్షా చేతికి గాయాలయ్యాయి. అనంతరం అమర్‌నాథ్‌రెడ్డి అక్కడికి వెళ్లాడు. వెంటనే గాయపడిన వారిని ఆసుపత్రికి తీసుకెళ్లారు. తలకు బలమైన గాయాలు కావడంతో ఆసుపత్రిలో వైద్యులు కుట్లు వేసి స్కానింగ్ అనంతరం ఇబ్బందకర పరిస్థితి ఏమీ లేదని తెలిపారు. ఇదిలా ఉంటే దాడికి కారణాలు ఏంటన్నది పోలీసులకు అంతుపట్టలేదు. దేని కోసం దాడి చేశార న్నాది తెలియాల్సి ఉంది. దాడి విషయం తెలియడంతో వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

'తాగునీటి సమస్య పరిష్కరించాలి'

గుడిబండ, మార్చి 13 : మండలంలోని బీటీపల్లి, హిరేతుర్పి, కల్లూరొప్పం, కొంకల్లు, పీ గొల్లహట్టి గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరారు. గ్రామాల్లో తాగునీటి బోర్లలో నీటి మట్టం అడుగంటిడంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామ ప్రజలు వాపోతున్నారు. అధికారులు వెంటనే చొరవ తీసుకుని గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలనివారు కోరుతున్నారు.

ప్రజాధనం నిరుపయోగం

గ్రామాల్లో దిష్టిబొమ్మల్లా తాగునీటి ట్యాంకులు



సీ కోడిగేపల్లిలో నిరుపయోగంగా ఉన్న ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్

మడకశిర రూరల్, మార్చి 13: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా, నిరంతరం నీరు అందించేందుకు గతంలో రూ. లక్షలు వెచ్చించి ఓహెచ్ఎస్ఆర్, జీఎల్ఎస్, శ్రీరామిరెడ్డి తాగునీటి ట్యాంకులను నిర్మించారు. ప్రస్తుతం వాటిని ఉపయోగించకపోవడంతో అవి పలు గ్రామాల్లో దిష్టిబొమ్మల్లా దర్శనమి స్తున్నాయి. మడకశిర మండలంలో 16 పంచాయతీలు, 115 గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడకుండా 350 తాగునీటి ట్యాంకులు (ఓహెచ్‌ఎస్ఆర్, జీఎల్ఎస్, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కింద) లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించారు. ప్రస్తుతం 80 శాతం గ్రామాల్లో ఆ నీటి ట్యాంకులను ఉపయోగించడం లేదు. పంచాయతీ అధికారులు తరచూ నీటి ట్యాం కులను శుభ్రం చేయక పోవడం, ట్యాం కులకు అమర్చిన పైపులైన్లు పగిలిపోతే వాటిని మరమ్మతులు చేయకపోవడం వంటి కారణాలతో ప్రజలు ఆ ట్యాంకుల్లో నీటిని పట్టుకోవడం లేదు. దీంతో అధికారులు బోర్ల నుంచి నేరుగా కొళాయి కనెక్షన్‌లు ఇచ్చారు. దీంతో ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి. మరికొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. మండలంలోని ఆమిదాలగొంది బీసీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు రూ.8 లక్షలతో ఓహెచ్‌ఎస్ఆర్ ట్యాంకును నిర్మించారు, సమీప చెరువులో వేసిన బోరు నుంచి పైపులైన్ ద్వారా ట్యాంకును నీటితో నింపేవారు. అక్కడి నుంచి కాలనీకి నీరు అందించేవారు. కొన్నేళ్ల తరువాత పైపులైన్ పగిలిపోయింది. పంచాయతీ వారు దానికి మరమ్మతులు చేయించలేకపోవడంతో ఆ ట్యాంకు నిరుపయోగంగా ఉంది. అలగే భక్తరహళ్లి, మెళవాయి, ఉప్పిడిపల్లి, ఉప్పార్లపల్లి, సీ కోడిగేపల్లిల్లో ఉన్న జీఎల్ఆర్ ట్యాంకులను శుభ్రం చేయకపోవడంతో ఆయా గ్రామస్థులు ఆ నీటిని పట్టుకోవడం లేదు. దీంతో ఆ ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి. అదే విధంగా పీఏబీఆర్ డ్యామ్ నుంచి శ్రీరామిరెడ్డి పథకాం ద్వారా వచ్చే స్వచ్ఛ మైన తాగునీటిని మడకశిర ప్రాంతంలో అందిస్తున్నారు. ప్రస్తుతం చాలా గ్రామాలకు ఆ నీరు అందడంలేదని ఆయా గ్రామాల ప్రజలు వా పోతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ట్యాం కులు నిర్మించారు. ప్రస్తుతం చాలా గ్రామాలకు ఆ నీటి పథకం కింద నీరు సరఫరా కావడం లేదు. దీంతో చాలా ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి. టీడీపల్లి తండాలో ట్యాంకు నిర్మించినప్పటి నుంచి ఇప్పటి వరకు నీరు అందలేదు. వైబిహళ్లిలో చివరి నిర్మించిన ట్యాంకుకు నీరు సరఫరా కాకపోవడంతో శిథిలా వస్థకు చేరింది. అది ఎప్పుడు కూలుతుందోనని ఆ ప్రాంత ప్రజలు భయాందోళనలో కాలం గడుపుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పగిలిపోయిన పైపులైన్ మరమ్మతులు చేపట్టాలని గ్రామీణులు కోరుతున్నారు. తాగునీటి ట్యాంకులను శుభ్రంచేసి నీటిని అందించాలంటున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య తగ్గుతుందని ప్రజలు అంటున్నారు.



భక్తరహళ్లిలో నిరుపయోగంగా జీఎల్ఎస్ ట్యాంక్

నేటి విద్యార్థులే రేపటి దేశ పౌరులు

ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధరా దేవి



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న వసుంధరా దేవి

చిలమత్తూరు, మార్చి 13: ప్రస్తుతం చదువుకుంటున్న విద్యార్థులు రేపటి పౌరులని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరా దేవి అన్నారు. ఆమె బుధవారం మండలంలోని కోడూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కోసం నల్లరాళ్లపల్లి టీడీపీ యువనాయకుడు కృష్ణమూర్తి నోటు పుస్తకాలు తీసుకురాగా, వాటిని వసుంధరా దేవి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వసుంధర దేవి మాట్లాడుతూ... విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు తీసుకురావాలని సూచించారు. సాంకేతికను అందుకోవాలి తప్ప సెల్‌ఫోన్లకు బానిస కారాదన్నారు. ముఖ్యంగా విద్యార్థినులు చదువుపై ధ్యాస పెట్టాలన్నారు. ఒక ఆడపిల్ల విద్యావంతురాలైతే ఆ ఇంటికే కాకుండా సమాజానికి వెలుగునిస్తుందని ఆమె పేర్కొన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థినులు బాగా చదవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు శ్రీనివాసులు, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సవిత ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



ముస్లింలకు ఆహార పదార్థాలను వడ్డిస్తున్న సవిత

పెనుకొండ టౌన్, మార్చి 13: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత ఆధ్వర్యంలో మంగళవారం పెద్దఎత్తున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ప్రత్యేక ప్రార్థన లు చేశారు. అనంతరం సవిత మాట్లాడుతూ ఇఫ్తార్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందని, మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్ జరుపుకోవాలన్నారు. మైనార్టీలకు టీడీపీ అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు. ముస్లింలు కఠిన ఉపవాసాలు ఆచరించి అల్లాకృపకు పాత్రులు కావాలన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

టీఎన్ఎస్ఎఫ్ నాయకులు



ఓటు ఆవశ్యకతను వివరిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

మడకశిర టౌన్, మార్చి 13 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి, ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపడితేనే రాష్ట్రానికి, యు వతకు భవిష్యత్తు అని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వినయ్ అన్నారు. తెలుగుదేశం పార్టీ ఎన్నికల శంఖారావంలో భాగంగా బుధ వారం మడకశిర ప్రభుత్వ ఎస్‌వైటీఆర్ డిగ్రీ కళాశాలలో ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాలలో మొదటి సారి ఓటు హక్కు వినియోగించుకోబోయే యువతి, యువకులకు ఓటు యొక్క ప్రా ముఖ్యతను వివరిస్తూ అవగాహన కల్పించారు. అలాగే ఈ రాష్ట్రానికి చంద్ర బాబు ఆవశ్యకతను వివరిస్తూ చేపట్టిన షై ఫస్ట్ ఓట్ టూ సీబీఎన్ పేరుతో చేపట్టిన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలంటే తెలుగుదేశం పార్టీ అధికా రంలోకి రావడం ఎంతో అవసరమి వివరించారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ మడకశిర అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సంతోష్ యాదవ్, గోపాల్, శ్రీను, కాంతరాజు, ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ధర్మవరంరూరల్, మార్చి13: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఓ యువకుడి దుర్మరణం చెందిన సంఘటన మండలంలోని చిగిచెర్ల వద్ద చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు బుధవారం తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ధర్మవరం పట్టణం లోనికోటకు చెందిన ఓబులనేని మల్లికార్జున, దేవి దంపతుల కుమారుడు దుర్గాప్రసాద్ (24) ద్విచక్రవాహనంలో మంగళవారం రాత్రి ధర్మవరం నుంచి అనంతపురానికి బయలుదేరాడు. కాగా మార్గమధ్యంలోని చిగిచెర్ల గ్రామసమీపంలో మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన గుంతలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో దుర్గాప్రసాద్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు బుధవారం ఉదయం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు. కాగా ఇటీవల కాలంలో చిగిచెర్ల క్రాస్ సమీపంలో వరుసగా ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాతపడుతున్నా అధికారులు, పోలీసులు చర్యలు చేపట్టలేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. చిగిచెర్ల క్రాస్ సమీపంలో స్పీడ్‌బ్రేకర్లు వద్ద, మలుపుల వద్ద ఎటువంటి సూచిక బోర్డులు లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా స్పందించి సూచికబోర్డులు ఏర్పాటుచేయాలని వారు కోరుతున్నారు.

ఏడు గ్యాస్ సిలిండర్ల సీజ్

అనంతపురం న్యూటౌన్, మార్చి13: ఉమ్మడి జిల్లాలో విజిలెన్స్ అధికారులు ముమ్మర దాడులు నిర్వహించారు. అందులో భాగంగా బుధవారం శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలకేంద్రంలోని కదిరి రోడ్డులో ఉన్న కాకతీయ రెస్టారెంట్‌లో తనిఖీలు చేపట్టారు. అక్కడ నిబంధనలకు విరుద్ధంగా ఇంటి అవసరాలకు వినియోగించాల్సిన వంటగ్యాస్ సిలిండర్లను కమర్షియల్‌కు వినియోగిస్తుండడంతో ఏడు సిలిండర్లను సీజ్ చేశారు. నిర్వాహకుడు గుణశేఖర్‌పై కేసు నమోదు చేశారు. తనిఖీలో ఎస్ఐ ఫణీంద్రనాథ్‌రెడ్డి, ఏఓ వాసుప్రకాష్, బత్తలపల్లి సీఎస్‌డీటీ శారద తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులతో బేరసారాలపై ఫిర్యాదు

కొత్తచెరువు, మార్చి 13: ఓపెన్‌స్కూళ్లకు సంబంధించిన విద్యార్థులను పది పరీక్షల్లో పాస్ చేయిస్తామని చెప్పి ఆయా స్కూళ్ల నిర్వాహకులు డబ్బులు వసూలు చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం మండలకేంద్రంలోని డీఈఓ కార్యాలయం వద్ద ఓపెన్‌స్కూళ్ల కో ఆర్డినేటర్ లాజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓపెన్ స్కూల్ విద్యార్థులకు కూడా ఈనెల 18వ తేదీ నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నాయని, కాగా ఇందులో పాస్ చేపిస్తామంటూ ఒక్కో విద్యార్థి నుంచి రూ.12వేల నుంచి రూ.15వేల వరకు ఆయా స్కూళ్ల నిర్వాహకులు బేరాలాడుతున్నారని తెలిపారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కదిరి, హిందూపురం ప్రాంతాలలో ఇలాంటి దందాలు జరుగుతున్నాయన్నారు. వీటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు నాగార్జున, బాబ్జాన్, వీరేశ్, హర్షకుమార్, హరి, భగత్ పాల్గొన్నారు.